VISION BHARATH REPORTER
విభారే
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారే" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా
అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్.
MOBILE:
9494498787,9440232308.

విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి
అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 09-06-2024 సంపుటి : 06 సంచిక : 268 పేజీలు : 8 వెల : రూ



# రామోజీరావు అస్తమయం



హైదరాబాద్, జూన్ 8 ,మీడియా దిగ్గజం, తెలుగురాష్ట్రాల ప్రజలకు అత్యంత సుపరిచుతులైన రామోజీరావు ఇక లేరు. ఆయన వయస్సు 87 సంవత్సరాలు. ఈ రోజు ఉదయం 4.50 నిమిషాలకు ఆయన తుదిశ్వాస విడిచినట్లు ఈనాడు సంస్థ ప్రకటించింది. ఈనాడు గ్రూపు సంస్థల ఛైర్మన్ గా ఉన్న రామోజీ రావు..ఈనెల 5న గుండె సంబంధిత సమస్యలతో హైదారాబాద్ లో ఓ ఆసుపత్రిలో చేరారు. అప్పటి నుంచి క్రిటికల్ సిచ్యుయేషన్ లో చికిత్స పొందుతున్న తెల్లవారుజామున కన్నుమూసినట్లు ఈనాడు సంస్థ అధికారిక ప్రకటన చేసింది. ప్రస్తుతం ఫిల్మ్ సిటీలోని రామోజీ నివాసానికి ఆయన పార్థివదేహాన్ని తరలిస్తున్నారు. 1936లో కృష్ణాజిల్లా పెదపారుపూడి అనే చిన్నగ్రామంలో జన్మించిన రామోజీరావు...వ్యవసాయ కుటుంబానికి నుంచి వచ్చి అంచెలంచెలుగా ఎదిగారు. అన్నదాత, మార్గదర్శి, ఈనాడు పత్రికలతో ఆయన తెలుగు వారందరికీ దగ్గరయ్యారు. రామోజీ ఫిలిం సిటీ నిర్మాణంతో రామోజీరావు పేరు దేశవ్యాప్తంగా మారుమోగిపోయింది. ఈటీవీ నెట్ వర్క్, కళాంజలి, ప్రియాఫుడ్స్, డాల్ఫిన్ గ్రూప్ ఆఫ్ హోటల్స్, ఉషాకిరణ్ మూవీస్ తో పలురంగాల్లోకి ప్రవేశించిన రామోజీ ప్రతీ చోట విజయవంతమయ్యారు. ఆయనకు ఇద్దరు కుమారులు కాగా చిన్న కుమారుడు సుమన్ 2012లో మృతి చెందారు. ఉషాకిరణ్ మూవీస్ పతాకంపై 58 సినిమాలను నిర్మించిన రామోజీరావు , జూనియర్ ఎన్టీఆర్, కీరవాణి, తరుణ్, విజయ్ దేవరకొండ లాంటి వారికి సినిమా ఇండస్ట్రీలో తొలి అవకాశాలను అందించారు. ఆయన మృతిపై సినీ రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటిస్తున్నారు.ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఐదో తేదీ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో ఆయన్ని ఆసుపత్రిలో చేర్చారు. పరీక్షలు చేసిన వైద్యులు స్టంట్ వేయాలని సూచించారు. వైద్యులు చెప్పినట్టుగా స్టంట్ వేసిన తర్వాత ఆయన పరిస్థితి కాస్త క్రిటికల్ అయింది. రెండు రోజులుగా తీవ్ర అస్వస్థతతో చికిత్స పొందుతున్న ఆయన ఈ ఉదయం కన్నుమూశారు. తెలుగు మీడియాను కొత్త పుంతలుతొక్కించిన రామోజీరావు చరిత్రలో తనకంటూ ప్రత్యేక అధ్యాయాన్నే నిర్మించుకున్నారు. రైతు బిడ్డగా పుట్టిన ఆయన ఓ సామ్రాజ్యాన్నే స్థాపించుకున్నారు. ఏదైనా కొత్తగా చేయడం ఆయనకు ఉన్న అలవాటు. పది ఏళ్ల భవిష్యత్‌ను ఇవాళే ఊహించడం కూడా ఆయనకు ఉన్న మరో గొప్ప లక్షణం. అలాంటి ఆలోచనలతో పురుడుపోసుకున్నవే ఆయన సంస్థలు. ప్రియా పచ్చళ్లు మొదలుకొని నేటి ఈటీవీ భారత్ వరకు చేసిన ప్రతీదీ చాలా స్పెషల్ కృష్ణా జిల్లా పెదపారుపూడిలో 1936 నవబర్ 16న సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన రామోజీ రావు తన స్వయం కృషితో మహా శక్తిలా ఎదిగారు. ఆయన చేపట్టిన ఏ ప్రాజెక్టు అయినా కచ్చితంగా ప్రజాదరణ పొందుతుందీ అంటే ఆయన కృషి అలాంటిది. 1974లో ఏర్పాటు చేసిన ఈనాడు దినపత్రిక అప్పట్లో పను సంచలనం రేపింది. అప్పుడే కాదు నేటికీ ఆ పేపర్ ప్రజల మనసులకు దగ్గరగా ఉంది. దీని వెనుక రామోజీ రావు పరిశ్రమ అనిర్వచనీయం.

# రామోజీ మృతికి చంద్రబాబు దిగ్భ్రాంతి

## మీడియా రంగంలో ఆయనది ప్రత్యేక శకం

## అసామాన్య విజేత అంటూ చంద్రబాబు నివాళి



అమరావతి,జూన్8:ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు అస్తమయంపై తెదేపా అధినేత చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒక సామాన్య కుటుంబంలో జన్మించి అసామాన్య విజయాలు సాధించిన రామోజీరావు మరణం తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని అన్నారు. అక్షర యోధుడుగా పేరున్న రామోజీ తెలుగు రాష్ట్రాలకు, దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.ఢిల్లీలో ఉన్న చంద్రబాబు నేరుగా ఫిల్మ్‌సిటీకి చేరుకుని భార్యతో కలసి రామోజీ భౌతిక కాయం వద్ద నివాళి అర్పించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన తిరిగి కోలుకుంటారని తామంతా భావించామని.. కానీ ఇలాంటి వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు వారి జీవితాల్లో అత్యంత ప్రభావవంతమైన ముద్ర వేసిన రామోజీరావు తెలుగు ప్రజల ఆస్తి అని.. ఆయన మరణం రాష్ట్రానికే కాదు, దేశానికి కూడా తీరని లోటని చంద్రబాబు అన్నారు. సమాజ హితం కోసం అనుక్షణం

పనిచేసిన ఆయన కీర్తి అజరామరం అని పేర్కొన్నారు. ఈనాడు గ్రూపు సంస్థలు స్థాపించి వేల మందికి ఉపాధి కల్పించారన్నారు. మీడియా రంగంలో రామోజీరావుది ప్రత్యేకమైన శకం అని చంద్రబాబు కొనియాడారు. ఎన్నో సవాళ్లను, సమస్యలను అధిగమించి...ఎక్కడా తలవంచకుండా విలువలతో సంస్థలను నడిపిన విధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. దశాబ్దాల పాటు తన ప్రయాణంలో అనుక్షణం ప్రజల మంచి కోసం, సమాజ హితం కోసం రామోజీరావు పనిచేశారని అన్నారు. మీడియా రంగంలో ఆయనొక శిఖరమని, ఆయన ఇక లేరు అనే విషయాన్ని తాము జీర్ణించుకోలేక పోతున్నామని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

# ఆర్థిక పరిస్థితిపై సీఎస్ ఆరా



## అధికారులతో నీరబ్ కుమార్ సమీక్ష

## నివేదిక సిద్దం చేయాలని ఆదేశాలు

అమరావతి,జూన్8: ఆంధ్రప్రదేశ్ సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ ఐఏఎస్ అధికారి నీరభ్ కుమార్ ప్రసాద్.. ఇక, వెంటనే తన పనిపై ఫోకస్ పెట్టారు.. శనివారం సచివాలయంలో ఆర్థిక శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆర్థిక శాఖ ఉన్నతాధికారి సత్యనారాయణ సహా ఇతర అధికారులు హాజరయ్యారు. ఏపీ ఆర్థిక స్థితి గతులపై కీలకంగా చర్చ సాగింది.. అయితే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వెంటనే నివేదిక సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సందర్భంగా సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ.. సీఎస్ గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నారా

చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.. సహచర అధికారులు సిబ్బందితో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు.. ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా తన పని ఉంటుంది.. మంచి చేసేలా కృషి చేస్తాను అన్నారు.. అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలుకు కృషి చేస్తాను అన్నారు. ఆంధప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు శాయశక్తులా కృషి చేస్తాను అన్నారు.

# దాడులకు పాల్పడుతున్నా పోలీసుల ప్రేక్షక పాత్ర

## వారిపై కోర్టుల్లో కేసులు వేస్తాం: కొడాలి నాని

గుడివాడ,జూన్8: ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ శ్రేణులపై దాడులకు పాల్పడుతున్న వారిపై, అడ్డుకోలేని పోలీసులపై హైకోర్టులో కేసు వేయనున్నామని మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు కొడాలి నాని వెల్లడించారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ, జనసేన నాయకులు ఉద్దేశపూర్వకంగా వైసీపీ శ్రేణుల పై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.అర్ధరాత్రి ఇళ్లకు వెళ్లి ఆస్తులు ధ్వంసం చేస్తున్నారని, వ్యక్తులపై దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. వైసీపీ పార్టీని నిస్తేజం చేయడానికి దాడులకు తెగబడుతున్నారని పేర్కొన్నారు.



వ్యక్తిగతంగా దాడులకు పాల్పడుతూ గ్రామాల్లో వైసీపీ శ్రేణులు ఉండవద్దని హెచ్చరిస్తున్నారని వెల్లడించారు. అల్లరి మూకలు దాడులకు పాల్పడుతుంటే పోలీసులు ప్రేక్షకులు పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. టీడీపీఅల్లరి మూకల దాడుల వీడియోలు, సీసీ పుటేజీలు, ఫొటోలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఎస్పీ, లోకల్ స్టేషన్‌లో ముందస్తుగా ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు రక్షణ కల్పించకపోగా దాడులకు పాల్పడ్డ వ్యక్తులపై కేసులు నమోదు చేయడం లేదని విమర్శించారు. వైసీపీ జిల్లా తరుపున హైకోర్టులో ప్రైవేట్ కేసులు వేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎలాంటి భయాందోళనలకు లోను కావద్దని ఆరోపించారు.

# నేడు ప్రధానిగా మోడీ ప్రమాణస్వీకారం



## మోడీతో ప్రమాణం చేయించనున్న రాష్ట్రపతి

## ప్రమాణస్వీకారోత్సవానికి ముస్తాబైన రాష్ట్రపతి భవన్

## సాయంత్రం 7.15 గంటలకు ప్రమాణ కార్యక్రమం

## ఢిల్లీ అంతటా భద్రత కట్టుదిట్టం..కమెండోల పర్యవేక్షణ

## ఢిల్లీకి చేరుకుంటున్న విదేశీ ప్రముఖులు

న్యూఢిల్లీ,జూన్8: నరేంద్రమోదీ మూడోసారి భారతదేశ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. ఆదివారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో ఆయన ప్రధానిగా ప్రమాణం చేస్తారు. ఆయనతో పాటు పలువురు మంత్రులు కూడా ప్రమాణం చేస్తారు. ఇందుకోసం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాట్లు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని, మంత్రులతో ప్రమాణం చేయిస్తారు. మోడీ వరుసగా మూడోసారి ప్రమాణం చేయడం ద్వారా తొలిప్రధాని నెహ్రూ రికార్డును సమం చేయబోతున్నారు.ఇప్పటికే 2014, 2019ల్లో ఆయన రెండు పర్యాయాలు ప్రధానిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో మరోసారి ప్రజలు ఎన్డీఏ కూటమికి పట్టం కట్టడంతో.. ఎన్డీఏ ఎంపీలంతా కలిసి మోదీని తమ నాయకుడిగా ఎన్నుకున్నారు. దాంతో ఆయన మూడోసారి పీఎంగా ప్రమాణస్వీకారం చేసేందుకు సిద్ధమయ్యారు.సాయంత్రం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు. నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ పార్లమెంటరీ పార్టీ తన నాయకుడిగా ఎన్నుకున్న తర్వాత జూన్ 7న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని నరేంద్ర మోదీని తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని అధికారికంగా కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే గెలుపుతో మూడోసారి ప్రధానిగా నరేంద్రమోడీ ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. 2014, 2019లో కాకుండా ఈ సారి మ్యాజిక్‌ఫిగర్(272)ని బీజేపీ స్వతహాగా సాధించలేకపోయింది. 240 సీట్ల వద్దే ఆగిపోయింది. దీంతో కూటమిలోని తెలుగుదేశం(టీడీపీ), జనతాదళ్ యునైటెడ్(జేడీయూ), శివసేన కీలకంగా మారాయి. మొత్తం 543 ఎంపీ సీట్లలో ఎన్డీయేకి ప్రస్తుతం 293 ఎంపీ బలం ఉంది. ఇదిలా ఉంటే మోడీ 3.0 సర్కార్‌లో మిత్రపక్షాలకు బెర్తులు ఖరారైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం.. చంద్రబాబు నాయుడు టీడీపికి నాలుగు మంత్రిత్వ శాఖలు, నితీష్ కుమార్ జేడీయూకి 2 మంత్రిత్వ శాఖలు దక్కే అవకాశం దాదాపుగా ఖరారు అయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే జేడీయూ నుంచి ఇద్దరు సీనియర్ నేతలైన లాలన్ సింగ్, రామ్‌నాథ్ ఠాకూర్ల పేర్లను ప్రతిపాదించింది. ప్రస్తుతం టీడీపికి 16, జేడీయూకి 12 సీట్లు ఉన్నాయి. ఇదిలావుంటే అనధికార సమాచారం మేరకు మోడీతో పాటు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా తదితరులు ప్రమాణం చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి దేశ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేస్తున్న తొలి వ్యక్తిగా నరేంద్రమోదీ గుర్తింపు పొందారు. ప్రమాణ స్వీకారం నేపథ్యంలో రాష్ట్రపతి భవన్ పరసరాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. అదేవిధంగా భద్రతా కారణాల రీత్యా ఢిల్లీని నో ఫ్లై జోన్‌గా కూడా ప్రకటించారు.

# ఓటమికి కారణాలు తెలియడం లేదు

## జగన్ సంక్షేమ పాలనను ప్రజలు తిరస్కరించారు

## వైకాపా మాజీ ఎంపి మార్గాని భరత్

అమరావతి,జూన్ 8: ఏపీలో వైసీపీ ఓటమికి గల కారణాలను తెలుసుకోవడానికి ఆ పార్టీకి చెందిన మాజీలు అన్వేషణలో పడ్డారు. ఫలితాలు వెలువడి ఐదు రోజులు కావస్తున్న జరిగిన పొరపాటును సవరించు కోవడానికైనా తమకు ఏం చేయాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు. రాజమహేంద్రవరం మాజీ పార్లమెంట్ సభ్యుడు మార్గాని భరత్ మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూస్తే జగన్‌ను మరోసారి పెద్ద ఎత్తున ఆశీర్వదిస్తారని అనుకున్నాం . గడపగడపకు తిరిగిన సమయంలో ప్రజల

# సంపాదకీయం

ఆదివారం 09-06-2024

## ఫలితాలు కనువిప్పు కావాలి !

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ముగిసి..కొత్త ప్రభుత్వాలు ఏర్పడుతున్న తరుణంలో ఫలితాలపై విశ్లేషణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌తో పాటు, ఒడిషాలో కొత్త ప్రభుత్వాలు ఏర్పడబోతున్నాయి. కేంద్రంలోనూ అసలు సిసలు ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడబోతోంది. గుడ్డిలో మెల్లలా ఎన్‌డిఎకు ఒడిషాలో, ఎపిలో ప్రభుత్వాలు ఏర్పాటు చేసే అవకాశం వచ్చింది. అయితే ఈ ఫలితాలు నేతలకు కనువిప్పు కావాలి. ప్రజల అవసరాలు, ఆకాంక్షలను తెలుసుకుని పాలన సాగించాలి. దేశంలో ఉన్న వనరులను సద్వినియోగం చేయడం ద్వారా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చ గలగాలి. అప్పుడే దీర్ఘకాలిక ప్రయోజనాలు నెరవేరుతాయి. ఓ ఏడాది క్రితం కర్నాటకలో, ఆరేడు నెలల క్రితం తెలంగాణలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఇవన్నీ కూడా ప్రజలు కోరుకున్న మార్పులే. మనమెంతగా నిజాయితీగా ఉ న్నామని చాటుకున్నా..ప్రజల ముందు వేషాలు వేయడం కుదరదని ఓటు ద్వారా చెప్పారు. ప్రధానంగా గత ఆరేడునెలల క్రితం తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వం ఘోరంగా ఓడింది. ఉద్యమపార్టీగా వచ్చిన టిఆర్‌ఎస్ ఫక్తు రాజకీయం మాత్రమే వంట బట్టించుకుని, కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించింది. అప్పులను చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసింది. దీనికి సంబంధించిన ప్రజల్లో వస్తున్న ఆందోళనలను ఎప్పుడూ పట్టించుకోలేదు. ప్రజలను అణచివేసి, రాజకీయ పార్టీలను తొక్కి అధికారం నిలబెట్టుకోవాలనుకున్న కల్వకుంట్ల వారి కలల కల్లలు అయ్యాయి. అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో మరింతగా బొందపెట్టారు. లేద్దామన్నా లేవకుండా పాతిపెట్టారు. ఇప్పటికిప్పుడు ఎన్ని వేషాలు వేసినా బిఆర్‌ఎస్‌ను నమ్మే పరిస్థితి మాత్రం లేదనే చెప్పాలి. అలాగే ఎపిలో కూడా జగన్ అంతకుమించి అన్నట్లు నిరంకుశంగా వ్యవహరించారు. తను మాత్రమే అధికారంలో ఉంటే చాలనుకుని విపక్ష నేతలపై కేసులు, దాడులతో నిరంకుశంగా పాలించారు. ప్రజల స్వేచ్ఛను హరించారు. అభివృద్ధి అంటే ప్రజల ఖాతాల్లో డబ్బులు వేయడమే అన్న సూక్తిని ఒంటబట్టించుకున్నారు. అందుకోసం విపరీతంగా అప్పులు చేశారు. ఈ క్రమంలో జగన్ పాలనపై వస్తున్న హెచ్చరికలను పట్టించుకోలేదు. సరికదా తాను అవ్వాతాతలు, అక్కచెల్లెళ్లు అందరికీ పంచి పెట్టాను ..అయినా ఓట్లేయలేదని వాపోయారు. పాలన అంటే పంచిపెట్టడం అనుకున్నారు. నిజానికి ప్రజలతో సంబంధం లేకుండా నిరంకుశంగా పాలన చేస్తే పరిణామాలు ఇలాగే ఉంటాయని కర్నాటక, తరవాత తెలంగాణ, ఇప్పుడు ఆంధ్రా, ఒడిషాలు నిరూపించాయి. అలాగే కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి కూడా ఇదో హెచ్చరిక కావాలి. కానీ ఆయన ఆత్మవిమర్శ చేసుకోలేదని, ఎన్‌డిఎ సమావేశంలో చేసిన ప్రసంగాన్ని బట్టి అర్థం అవుతుంది. ప్రజలను దూరంగా పెట్టి పాలిద్దామనుకునే వారికి ప్రజల్లో అంతగా ఆదరణ ఉండదని తాజా ఫలితాలు తెలియ చేస్తున్నాయి. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలను అంటిపెట్టుకుని వారిని కేంద్రంగా చేసుకుని అభివృద్ధి పనులు సాగించాలి. ఇష్టం వచ్చినట్లు అప్పులు చేసి, సగం వెనకేసుకుని అభివృద్ధి చేసామంటే ప్రజలు నమ్మరని గుర్తించాలి. రాజ్యాంగేతర శక్తుల్లా మారి అధికారం చెలాయిస్తే ఎలా ఉంటుందో ఇటీవల మూడు ప్రభుత్వాల పతనాలు నిరూపించాయి. ఆంధ్రప్రదేశ్‌లో అధికారం కోల్పోయిన వైఎస్‌ఆర్‌సిపి అధినేత జగన్ రెడ్డి పతనం వెనుక అధికారులే కీలక పాత్ర వహించారని, వారు సిఎంఒ కార్యాలయంలో రాజ్యాంగేతర శక్తులుగా మారి మంత్రులు, ఎంఎల్‌ఎలకు, ప్రజలకు సిఎంను దూరం చేశారని కొందరు వైసిపి నేతలే ఇప్పుడు జ్ఞానోదయం పొంది వ్యాఖ్యానిస్తున్నారు. కానీ ఇది వినడానికి అతికినట్లుగా లేదు. ఎందుకంటే నాయకుడు అన్నవాడికి ప్రజలతో నిత్య సంబంధం అవసరం. కాన్వాయ్ కార్లలో తిరుగుతూ, విమానాల్లో చక్కర్లు కొడితే కెసిఆర్ అయినా, జగన్ అయినా నేలకు దిగాల్సిందే. ప్రజల పవర్ ఏంటో తెలుసుకోవా ల్సిందే. ఈ ఇద్దరు నేతలు అహంకారమే అలంకరణగా పాలన సాగించారు. ప్రజలు అనేవారిని పురుగుల్లా చూశారు. చట్టాలను చట్టుబండలు చేశారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా ఏలారు. ఒడిషాలో సిఎం అవినీతి పరుడు కాకున్నా ప్రజలతో నేరుగా సంబంధాలు లేవు. అందుకే అక్కడ బిజెపి పాగా వేయగలిగింది. సిఎం జగన్ మోహన్ రెడ్డికి ప్రజాక్షేత్రంలో ఏమి జరుగుతుందో, ప్రజల నిజ సమస్యలేమిటో తెలియకుండా పోయింది. సిఎంలో అధికారులపై ఆధారపడి, క్షేత్రస్థాయిలో ప్రజలు పట్టించుకోక పోతే ఫలితాలు ఇలాగే ఉంటాయి. ప్రజలను కలవాల్సిన అసవరం సిఎంకు ఏముందని గతంలో కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను గమనిస్తే ఆయన స్థాయి ఏమిటో ప్రజలకు అర్థం అయ్యింది. అందుకే ప్రజలు కర్రును ఎర్రగా కాల్చి మళ్లీ కోరుకోకుండా వాతలు పెట్టారు. ఇప్పుడా వాతలను మాన్పించుకునే ప్రయత్నంలో ఉ న్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఆ రాష్ట్రంతో పాటు ఒడిశాలో అధికారం కోల్పోయిన నవీన్ పట్నాయక్, తెలంగాణలో పదవిని చేజార్చుకున్న కెసిఆర్ లకు కూడా ఇవి వర్తిస్తాయి. అధికారంలో ఉ న్నప్పుడు బ్యూరోక్రాట్ల పాలనకు అవకాశం ఇవ్వరాదు. ప్రజాప్రతినిధులుగా ఉన్న మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలకు మధ్య వారధిలా సిఎం అనేవాడు ఉండాలి. అప్పుడే ప్రజాక్షేత్రంలోని అసలు సమస్యలు, పాలనలో మంచి చెడులు అధినేత దృష్టికి వస్తాయి. తప్పులుంటే సరిదిద్దుకునే అవకాశం కల్పించుకోవాలి. ఒడిశాలో 24 ఏళ్ళుగా ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలన సాగించిన నవీన్ పట్నాయక్ పదవీచ్యుతుడు కావడానికి కూడా అక్కడ ప్రైవేటు సెక్రటరీగా పని చేసిన వికె పాండ్యన్ కారణమని రాజకీయ, అధికార వర్గాల్లోనే కాకుండా దేశ వ్యాప్తంగా ప్రచారం జరుగుతున్నది. వికె పాండ్యన్ గడిచిన కొన్ని

## ప్రజలను విస్మరిస్తే పతనం తప్పదు...

హైదరాబాద్ జూన్ 8 పాలితులతో పాలకులు ఎంతగా మమేకమైతే అంతగా ఆదరణ ఉంటుంది. అధికారంలో ఉన్నా లేకున్నా ప్ర జలు అలాంటి పాలకులను గుండెల్లో చిరకాలం చిరస్మరణీయంగా ఉం చుకుంటారు. చరిత్ర పుటల్లో కూడా వారి పేరు చెక్కుచెదరకుండా ఉం టుంది. కాని పాలకులు, పాలితులకు దూరమైతే ఎలా ఉంటుందో, పా లకులకు పాలితులకు మధ్య అధికారులు సైంధవుల్లా రాజ్యాంగేతర శ క్తుల్లా మారి అధికారం చెలాయిస్తే ఎలా ఉంటుందో ఇటీవల మూడు ప్రభుత్వాల పతనాలు నిరూపించాయి. తాజాగా, ఆంధ్రప్రదేశ్‌లో అధికారం కోల్పోయిన వైఎస్‌ఆర్‌సిపి అధినేత జగన్ రెడ్డి పతనం వెనుక అధికారులే కీలక పాత్ర వహించారని, వారు సిఎంఒ కార్యాలయంలో రాజ్యాంగేతర శక్తులుగా మారి మంత్రులు, ఎంఎల్‌ఎలకు, ప్రజలకు సిఎంను దూరం చేశారని దాని ఫలితమే జగన్ ఓటమి అంటూ ఆ పార్టీకి చెందిన మాజీ ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా సంచలనంగా వ్యాఖ్యానించారు.సిఎం జగన్ మోహన్ రెడ్డికి ప్రజాక్షేత్రంలో ఏమి జరుగుతుందో, ప్రజల నిజ సమస్యలేమిటో తెలియకుండా సిఎంఒలో ఐఎఎస్ అధికారి ధనుంజయరెడ్డి అడ్డుగోడలు సృష్టించారని రాజా సంచలనంగాబాంబు పేల్చారు. సిఎంఒలో అదనపు కార్యదర్శిగా పని చేసిన కె. ధనుంజయ రెడ్డి సిఎంకు, ప్రజలకు మధ్య పాతాళమంతా అగాథం సృష్టించారని, దీనితో జగన్ మోహన్ రెడ్డి అవమానకరమైన ఓటమిని చవిచూశారని దీనికి ఆ అధికారే కారణమని కూడా రాజా నిందించారు. సీనియర్ ఐఎఎస్ అధికారి ధనుంజయ రెడ్డి సమైక్య రాష్ట్రంలో నాటి సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో కీలక అధికారిగా ఎన్నో శాఖల్లో సమర్థుడైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. నిజానికి ఆయన సర్పంచ్ స్థాయి నుంచి ఐఎఎస్‌గా ఎదిగి ఆ తర్వాత పాలకులకు విశ్వసనీయ అధికారిగా జగన్ పాలనలో సిఎంఒ అదనపు కార్యదర్శిగా పని చేసి చివరి సమయంలో విమర్శల పాలు కావలసివచ్చింది.రాజా చేసిన వ్యాఖ్యలు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఆ రాష్ట్రంతో పాటు ఒడిశాలో అధికారం కోల్పోయిన నవీన్ పట్నాయక్, ఐదు నెలల క్రితం సిఎం పదవిని చేజార్చుకున్న కెసిఆర్ సిఎంఒ కార్యాలయానికి కూడా వర్తిస్తాయని ఈ మూడు రాష్ట్రాల అధికార, అనధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికారంలో ఉన్నప్పుడు సిఎంఒ కార్యాలయాలు బ్యూరోక్రాట్ల పాలనకు నిలయంగా మారకూడదు. అవి ప్రజలకు, వారి తరఫున ప్రతినిధులుగా ఉన్న మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలకు మధ్య వారధిలా ఉండాలి. ఈ అధికారులు సిఎంఒకు కళ్ళు, చెవులుగా ఉండడమే కాకుండా ప్రజలతో నిత్య సంబంధాలున్న ప్రజా ప్రతినిధులకు కూడా అందుబాటులో ఉండాలి, వారికి సిఎంను కూడా అందుబాటులో ఉంచాలి. అప్పుడే ప్రజాక్షేత్రంలోని అసలు సమస్యలు, పాలనలో మంచి చెడులు అధినేత దృష్టికి వస్తాయి.తప్పులుంటే సరిదిద్దుకునే అవకాశం ఏర్పడుతుంది. కాని ఈ అధికారులు సూపర్ పవర్లుగా మారి ప్రజా ప్రతినిధులకు కూడా అధినేతలను కలిసే అవకాశం కల్పించకపోవడంతో సిఎంలు అధికారం కోల్పోవలసి వస్తుందని రాజా వ్యాఖ్యలను సమర్థిస్తున్న ప్రజాప్రతి నిధులు, కొందరు రిటైర్డు అధికారులు అంటున్నారు. ఒడిశాలో 24 ఏళ్ళుగా ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలన సాగించిన నవీన్ పట్నాయక్ పదవీచ్యుతుడు కావడానికి కూడా అక్కడ ప్రైవేటు సెక్రటరీగా పని చేసిన వికె పాండ్యన్ కారణమని రాజకీయ, అధికార వర్గాల్లోనే కాకుండా దేశ వ్యాప్తంగా ప్రచారం జరుగుతున్నది.

## వయనాడ్ సీటును వదులుకోనున్న రాహుల్ గాంధీ


న్యూఢిల్లీ: కేరళలోని వయనాడ్, యూపీలోని రాయ్‌బరేలీ నుంచి రాహుల్ గాంధీలోక్‌సభకు ఎన్నికైన విషయం తెలిసిందే. అయితే వయనాడ్ సీటును రాహుల్ గాంధీ ఖాళీ చేయనున్నట్లు తెలుస్తోంది. రాయ్‌బరేలీ ఎంపీ హోదాను అలాగే ఉంచుకోవాలని, ఎందుకంటే యూపీలో పార్టీ అభివృద్ధిపై దృష్టి సారించాల్సి ఉంటుందని యూపీ కాంగ్రెస్ కమిటీ పేర్కొన్నది.



వయనాడ్‌లోనే ఉండాలని తొలుత కేరళ కాంగ్రెస్ కూడా కోరినా.. యూపీ కాంగ్రెస్ అభ్యర్థన తర్వాత వాళ్లు కూడా వెనక్కి తగ్గారు. శనివారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మీటింగ్‌లో దీనిపై చర్చ వచ్చినట్లు తెలుస్తోంది. అయితే రెండు నియోజకవర్గాల్లో పర్యటించిన తర్వాత దీనిపై అధికారిక ప్రకటన వెలుబడే అవకాశాలు ఉ న్నాయి. వయనాడ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రియాంకా గాంధీ పోటీ చేయాలన్న అభ్యర్థనను గాంధీ కుటుంబం తిరస్కరించినట్లు తెలుస్తోంది. కేరళకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతను వయనాడ్ నుంచి రంగంలోకి దింపాలని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. వయనాడ్ నుంచి 3,64,422 ఓట్ల తేడాతో రాహుల్ గాంధీ గెలిచినా.. 2019 నాటి ఫలితాలతో పోలిస్తే సుమారు 67,348 ఓట్ల సంఖ్య తగ్గింది. వయనాడ్‌లో అన్నా రాజాను ఓడించగా, రాయ్‌బరేలీలో దినేశ్ ప్రతాప్ సింగ్‌పై 3,89,341 ఓట్లతో విక్టరీ కొట్టారు.

## రామోజీరావు మృతి తీరని లోటు.. చిరకాలం గుర్తుండిపోతారు.. ఆర్‌ఎస్‌ఎస్ సంతాపం..

ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు కన్నుమూశారు. ఇటీవల అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో రామోజీరావు.. శనివారం తెల్లవారుజామున 4.50 గంటలకు తుదిశ్వాస విడిచారు.రామోజీ ఫిల్మ్‌సిటీలో ఆయన పార్థివదేహాన్ని ఉంచారు. ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. అయితే.. రామోజీరావు భారతీయ చలనచిత్ర రంగాన్ని నూతన శిఖరాలకు చేర్చారు. ఉషాకిరణ్ మూవీస్ ద్వారా వివిధ భాషల్లో 87 లు నిర్మించారు.. ఉషాకిరణ్ మూవీస్ బ్యానర్ ద్వారా ఎంతోమంది నటులు పరిచయమై ఎంతోమంది నటులు, అగ్రశ్రేణి తారలుగా ఎదిగారు. భారతీయ చలనచిత్ర రంగాన్ని నూతన శిఖరాలకు చేర్చారు రామోజీరావు.. ఈటీవీ మీటీవీ అంటూ బుల్లితెరపై అద్భుతాలు సృష్టించారు. కాగా.. రామోజీరావు మృతి పట్ల పత్రికా, సినీరంగంతోపాటు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తంచేస్తున్నారు. అక్షరయోధుడు రామోజీరావు మృతి తీరని లోటు అంటూ నివాళులర్పిస్తున్నారు.రామోజీరావు మృతి చాలా బాధాకరమని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఖీూ) పేర్కొంది.. రామోజీరావుకు నివాళులర్పించి.. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపింది. ఈ మేరకు ఆర్‌ఎస్‌ఎస్ సర్కార్యవ దత్తాత్రేయ హోసబాలే ప్రకటన విడుదల చేస్తూ.. ఆర్‌ఎస్‌ఎస్ సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్ లో షేర్ చేశారు."ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, రామోజీ ఫిలిం సిటీ వ్యవస్థాపకులు రామోజీరావు మృతి.. ముఖ్యంగా జర్నలిజం, రంగానికి తీరని లోటు. ఆయన ఎంచుకున్న రంగంలో ప్రత్యేక లక్షణాలు, అభ్యాసాలను జోడించడంలో మార్గదర్శకుడిగా అతని సహకారం చిరకాలం గుర్తుండిపోతుంది. రామోజీరావు కుటుంబ సభ్యులకు, అభిమానులకు మా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాము.. మరణించిన ఆత్మకు సద్గతి ప్రసాదించాలని సర్వశక్తిమంతుడిని ప్రార్థిస్తున్నాము. ఓం శాంతిః" అంటూ ఆర్‌ఎస్‌ఎస్ ట్వీట్ చేసింది..




## ప్రధాని ప్రమాణస్వీకారానికి అంతర్జాతీయ నేతలకే ఆహ్వానం : జైరామ్ రమేశ్



ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి రావాలంటూ కాంగ్రెస్ నేతలకుగానీ, ఇండియా కూటమి నేతలకుగానీ ఎలాంటి ఆహ్వానాలు అందలేదని.. కాంగ్రెస్ సీనియర్ నేత, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు. వాళ్లు కేవలం అంతర్జాతీయ నేతలను మాత్రమే ప్రమాణస్వీకారానికి ఆహ్వానిస్తున్నారని ఎద్దేవా చేశారు.'వాళ్లు కేవలం అంతర్జాతీయ నాయకులను మాత్రమే ప్రధాని ప్రమాణస్వీకారానికి ఆహ్వానిస్తున్నారు. మా నాయకులకు ఇంతవరకు ఎలాంటి ఆహ్వానాలు అందలేదు. ఒకవేళ ఇండియా కూటమి నాయకులకు ఆహ్వానాలు అందితే.. వెళ్లాలా వద్దా అనేది అప్పుడు నిర్ణయించుకుంటాం' అని జైరామ్ రమేశ్ చెప్పారు. ఇవాళ మధ్యాహ్నం ఢిల్లీలో ఇండియా కూటమి సమావేశం అనంతరం ఆయన కేసీ వేణుగోపాల్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు.

## రామోజీ రావు మొబైల్ ఎన్‌సైక్లోపీడియా : కేటీఆర్



హైదరాబాద్ : ఈనాడు అధినేత రామోజీ రావు పార్థివదేహానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలుగు పత్రికా రంగంతో పాటు తెలుగు ప్రసార మాధ్యమాల్లో ఒక విప్లవాత్మకమైన మార్పుకు రామోజీ రావు బీజం వేశారు. ఈనాడు పత్రిక స్థాపించిన తర్వాత, ఈటీవీ ద్వారా ఎల్రాన్టిక్ మీడియా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ప్రొఫెషనిలజంతో, విలువలతో కూడిన జర్నలిజానికి రామోజీ రావు గుర్తుగా నిలిచిపోతారు. తెలుగు భాషాభివృద్ధి కోసం ఆయన ఎంతో తపన పడ్డారు. దేశం, రాష్ట్రం బాగుండాలని కోరుకునేవారు.తెలుగు ప్రజలు, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల గురించి గొప్పగా మాట్లాడేవారు. ఎన్నో సందర్భాల్లో ఇదే ఫిలిం సిటీలో వారిని కలుసుకునే అవకాశం తనకు లభించింది. మొబైల్ ఎన్‌సైక్లోపీడియా లాగా అన్ని విషయాలు చెప్పేవారు. రామోజీ మృతి తెలుగు పత్రికా రంగానికే కాకుండా ప్రపంచంలోని తెలుగు వారందరికీ తీరని లోటు అని పేర్కొన్నారు. యూనివర్సల్ స్టూడియో స్థాయిలో రామోజీ ఫిలిం సిటీని నిర్మించాలన్న విజన్ రామోజీ రావుకే ఉండే. ఆయన ఆలోచనలు, జ్ఞాపకాలు తప్పకుండా భవిష్యత్‌లో అందరికీ స్ఫూర్తినిస్తాయి. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. ఎప్పటికీ తెలుగు జాతి ఆయనను గుర్తు పెట్టుకుంటుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.

## కేంద్రం తరఫున రామోజీరావుకు నివాళు లర్పించనున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ:ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు కన్నుమూశారు. ఇటీవల అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చేరిన ఆయన ఇవాళ తెల్లవారుజామున 4.50 గంటలకు తుదిశ్వాస విడిచారు.రామోజీ ఫిల్మ్‌సిటీలో ఆయన పార్థివదేహాన్ని ఉంచారు. ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. భారతీయ చలనచిత్ర రంగాన్ని నూతన శిఖరాలకు చేర్చారు రామోజీరావు. ఉషాకిరణ్ మూవీస్ ద్వారా వివిధ భాషల్లో 87 లు నిర్మించారాయన. ఉషాకిరణ్ మూవీస్ బ్యానర్ ద్వారా ఎంతోమంది నటులు పరిచయమై ఎంతోమంది నటులు, అగ్రశ్రేణి తారలుగా ఎదిగారు. భారతీయ చలనచిత్ర రంగాన్ని నూతన శిఖరాలకు చేర్చారు రామోజీరావు. ఈటీవీ మీటీవీ అంటూ బుల్లితెరపై అద్భుతాలు సృష్టించారు రామోజీరావు. 1995 ఆగస్టులో తెలుగు ప్రేక్షకుల కోసం ఈటీవీ ప్రారంభించారు. సీరియల్స్ ద్వారా వేలమంది నటీనటులను బుల్లితెరకు పరిచయం చేశారు రామోజీరావు. తక్కువ సమయంలోనే జాతీయస్థాయి నెట్‌వర్క్‌గా ఈటీవీ విస్తరించింది. ప్రతిక్షణం ప్రపంచ వీక్షణం పేరిట 13 భాషల్లో అందించారు రామోజీరావు.ఈ నేపథ్యంలో శనివారం కేంద్రం ప్రభుత్వం తరపున కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రామోజీరావుకు నివాళులు అర్పించనున్నారు. ఈ రోజు సాయంత్రం రామోజీ ఫిల్మ్‌సిటీకి చేరుకోనున్న కిషన్‌రెడ్డి నివాళులు అర్పిస్తారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రామోజీ రావు మృతిపట్ల సంతాపాన్ని వ్యక్తం చేశారు. జర్నలిజం రంగంలో, చలనచిత్ర ప్రపంచంలో ఆయన చేసిన సేవలను గుర్తించారు.



# బాండ్లు సేకరిస్తున్న విశాఖ కార్పొరేషన్

విశాఖపట్టణం, జూన్ 8 లోక్‌సభ ఎన్నికల ముందు కొద్దిగా మందగించిన బాండ్ మార్కెట్, ఇప్పుడు మళ్లీ రైజింగ్‌లో ఉంది. నేషనల్ మీడియా రిపోర్ట్స్ ప్రకారం, ఆరు మున్సిపల్ కార్పొరేషన్లు బాండ్లను జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. విశాఖపట్నంతో పాటు నాసిక్, కాన్పూర్, సూరత్, వారణాసి, ప్రయాగ్‌రాజ్ వంటి 6 పెద్ద నగరాల సివిక్ బాడీలు బాండ్ మార్కెట్‌లోకి అడుగు పెట్టబోతున్నాయి. ఇవన్నీ.. మునిసిపల్ బాండ్లు జారీ చేసి డబ్బు సేకరించేందుకు సిద్ధంగా ఉన్నాయని జాతీయ మీడియా వార్తలను బట్టి తెలుస్తోంది. ఈ మునిసిపల్ బాడీలు వచ్చే నెల (జులై 2024) చివరిలోగా మునిసిపల్ బాండ్లను జారీ చేయవచ్చు. దీనర్థం... వచ్చే నెలన్నర రోజులు బాండ్ మార్కెట్‌లో చాలా బిజీని మనం చూడబోతున్నాం. రిపోర్ట్సును బట్టి చూస్తే... బాండ్ల జారీ ద్వారా మునిసిపల్ కార్పొరేషన్లు 100 కోట్ల రూపాయల నుంచి 300 కోట్ల రూపాయల వరకు సేకరించే ఛాన్స్ ఉంది. బాండ్ల జారీని సింపుల్‌గా చెప్పాలంటే... మునిసిపల్ సంస్థలు పెట్టుబడిదార్ల నుంచి అప్పు తీసుకుంటాయి, ఆ మొత్తాన్ని నిర్ణీత కాలం తర్వాత వడ్డీతో కలిపి చెల్లిస్తాయి. బాండ్లు కొనేవాళ్లకు ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను మునిసిపల్ కార్పొరేషన్లు ఆఫర్ చేయబోతున్నట్లు సమాచారం. బాండ్ ఇష్యూలపై పెట్టుబడిదార్లకు 7.9 శాతం నుంచి 8.3 శాతం వరకు వడ్డీ లభించొచ్చు.మునిసిపల్ కార్పొరేషన్లకు చాలా బాధ్యతలు ఉంటాయి. నగరాల్లో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కొనసాగించడానికి, ఇతర ఆర్థిక అవసరాలను తీర్చుకోవడానికి మునిపల్ కార్పొరేషన్లకు డబ్బు కావాలి. బాండ్ల జారీ ద్వారా ఆ డబ్బును సమీకరించడం వాటి ముందున్న మార్గాల్లో ఒకటి. గతంలో, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కూడా బాండ్ల జారీ ద్వారా నిధులు సేకరించింది. దీంతోపాటు... అహ్మదాబాద్, భోపాల్, ఇండోర్, పుణె, లఖ్‌నవూ మునిసిపల్ బాడీలు కూడా 2017 నుంచి 2024 మార్చి మధ్యకాలంలో బాండ్లను ఇష్యూ చేశాయి. ఈ 6 మునిసిపల్ సంస్థలు కలిసి, ఈ ఏడేళ్లలో సుమారు రూ.3,000 కోట్లు సమీకరించాయి. ఇటీవల, వడోదర మున్సిపల్ కార్పొరేషన్ కూడా 'సర్టిఫైడ్ గ్రీన్ మున్సిపల్ బాండ్'లను జారీ చేసి రూ.100 కోట్లు సేకరించింది. ఈ డబ్బును మంచినీటి మౌలిక సదుపాయాల కల్పన కోసం ఉపయోగిస్తుంది.ప్రస్తుతం, మునిసిపల్ కార్పొరేషన్లు ప్రారంభించే మునిసిపల్ బాండ్లలో పెట్టుబడి పెట్టడానికి సంస్థాగత పెట్టుబడిదార్లకు మాత్రమే అనుమతి ఉంది. రిటైల్ పెట్టుబడిదార్లకు కూడా అవకాశం కల్పించే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ దిశలో, గత సంవత్సరం విడుదలైన ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ బాండ్లు మొట్టమొదటివి. సోలార్ పవర్ ప్రాజెక్ట్ కోసం తీసుకొచ్చిన ఆ ఇష్యూలో ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ రూ.244 కోట్లు సమీకరించింది. రిటైల్ ఇన్వెస్టర్లు కూడా డబ్బును పెట్టుబడి పెట్టిన మొదటి మునిసిపల్ బాండ్ ఇష్యూ అదే.

# మైనార్టీ నేతలు ముగ్గురే...

గుంటూరు, జూన్ 8 ఏపీ అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు వచ్చేశాయి. ఈ ఎన్నికల్లో టీడీపీ 135 స్థానాల్లో విజయం సాధించింది. జనసేన పార్టీ 21 సీట్లు గెలిచింది. వైఎస్సార్‌సీపీ 11 చోట్ల, బీజేపీ 8 చోట్ల గెలిచాయి.ఈ ఎన్నికల ఫలితాల తర్వాత అసెంబ్లీలో మైనారిటీల ప్రాతినిధ్యం తగ్గింది. టీడీపీ ఈసారి ముగ్గురు మైనారిటీలకు టికెట్ ఇవ్వగా, వైసీపీ 8 మందికి టికెట్లు ఇచ్చింది. బీజేపీ, జనసేన ఒక్క మైనారిటీకి కూడా టికెట్ కేటాయించలేదు. వైసీపీ టికెట్లు ఇచ్చిన మైనారిటీల్లో ఒక్కరు కూడా గెలవలేదు. ఇక టీడీపీ టికెట్లు ఇచ్చిన ముగ్గురు గెలిచారు. దీంతో ఈసారి అసెంబ్లీలో మైనారిటీలకు ప్రాతినిధ్యం వహించేది ఈ ముగ్గురే.గుంటూరు ఈస్ట్ నుంచి మహ్మద్ నసీర్ అమ్మద్ విజయం సాధించాడు. ఇక నంద్యాల నుంచి మహ్మద్ ఫరూక్, మదన పల్లి నుంచి షాజహాన్ బాషా విజయం సాధించారు. ఆంధ్రప్రదేశ్‌లో 2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం జనాభాలో 9.5 శాత మంది మైరారిటీలు ఉన్నారు. వీరంతా ఓబీసీలుగా పరిగణించబడుతున్నారు. తాము మూడోసారి అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని బీజేపీ ప్రకటించింది. బీజేపీ కేంద్రంలో మరోసారి అధికారంలోకి వచ్చింది. ఇక ఏపీలో బీజేపీ?టీడీపీ?జనసేన కూటమిగా పోటీ చేశాయి. ఈ సమయంలో మైనారిటీల ప్రాతినిధ్యం తగ్గడం గమనార్హం.ఇదిలా ఉండగా, ఏపీలో కొత్తగా ఏర్పడే ఎన్‌డీఏ ప్రభుత్వంలో టీడీపీ ఎక్కువ మంత్రి పదవులు తీసుకోవడం ఖాయం. తర్వాత జన సేనకు, తర్వాత బీజేపీకి పదవులు వరిస్తాయి. మైనారిటీ కోటాలో మంత్రి పదవులు ఇవ్వాల్సి వస్తే టీడీపీ తరఫున గెలిచిన ముగ్గురు మహ్మద్ నసీర్ అమ్మద్, మహ్మద్ ఫరూక్, షాజహాన్ బాషా లలో ఒకరికి దక్కుతుంది. ఆ ఒక్కరు ఎవరు అనేది ఇప్పుడు ఏపీ మైనారిటీల్లో చర్చనీయాంశంగా మారింది.

# వైసీపీకి రావెల రాజీనామా..



గుంటూరు, జూన్ 8 ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు అనూహ్య మలుపులు తిరుగుతున్నాయి. ఎన్నికల ఫలితాలు వచ్చిన రెండు రోజుల్లోనే మాజీ మంత్రి రావెల కిషోర్ వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లుగా ప్రకటించారు. ఎన్నికలకు ముందు భారత రాష్ట్ర సమితిలో ఉన్న ఆయన ఆ తర్వాత రాజీనామా చేసి వైసీపీలో చేరారు. తన భార్యను కూడా ఆయన పార్టీలో చేర్చారు. బాపట్ల ఎంపీ టిక్కెట్ ఆయనకు లేదా ఆయన భార్యకు ఇస్తారని అనుకున్నారు. కానీ టిక్కెట్ ఇవ్వలేదు. అయినప్పటికీ ఎన్నికల్లో వైసీపీ కోసం పని చేశారు. ఎన్నికల ఫలితాలు అనుకూలంగా లేకపోవడంతో ఆయన పార్టీకి గుడ్ బై చెప్పారు. రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించిన ఆయన చంద్రబాబుపై ప్రశంసలు కురిపించారు. 2014లో తనకు టిక్కెట్ ఇచ్చి.. గెలిపించి మంత్రిని చేశారని చెప్పుకొచ్చారు. మంత్రి పదవి నుంచి మధ్యలో తప్పించడంతో పాటు తర్వాత ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్ ఇవ్వలేదు. పార్టీ నేతలతో సఖ్యతగా ఉండకపోవడమే దీనికి కారణం. తర్వాత పలు పార్టీలు మారారు. దురదృష్టవశాత్తూ కొన్ని కారణాలతో టీడీపీలో కొనసాగలేకపోయినందుకు ఎప్పుడూ బాధపడుతూనే ఉంటానని తెలిపారు. మళ్లీ చంద్రబాబు నాయకత్వంలో పనిచేసేందుకు ఎన్నోసార్లు ప్రయత్నించినా సఫలం కాలేదని వాపోయారు. వైఎస్ జగన్.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజ్యాధికారం తెస్తానన్న మాటలు నమ్మి తాను వైసీపీలో చేరినట్లు తెలిపారు. కానీ, ఈ ఎన్నికల్లో మెజారిటీ ప్రజలు ఆయనను తిరస్కరించారని పేర్కొన్నారు. ఈ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు వల్లనే సాధ్యమవుతుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ప్రజలు అఖండ విజయం ఇచ్చారని ప్రశంసించారు. మందా క్రిష్ణ మాదిగ 40 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నారు. ఇప్పుడు ఆ అంశం ముగింపునకు వచ్చిందని భావిస్తున్నానని రావెల అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, చంద్రబాబు ఇద్దరూ వర్గీకరణకు మద్దతు తెలిపారన్నారు. 2014 ఎన్నికల్లో గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నుంచి టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన రావెల కిశోర్‌బాబు.. చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. అయితే 2019 ఎన్నికల ముందు జనసేనలో చేరి ఆ పార్టీ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత కొద్ది రోజులకే ఆయన బీజేపీలో చేరారు. ఆ తర్వాత ఆ పార్టీకి కూడా రాజీనామా చేసిన ఆయన.. కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కొంత కాలం తర్వాత బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి.. వైసీపీలో చేరారు. ఇప్పుడు ఆ పార్టీకి కూడా రావెల కిషోర్‌బాబు. ఇప్పుడు రావెల కిషోర్ ఏ పార్టీల చేరాలన్నా రెండో సారి ఎంట్రీ ఇవ్వాల్సిందే.

# షర్మిళపై కాంగ్రెస్ లో తిరుగుబాటు



కడప, జూన్ 8 ఏపీలో షర్మిల అనుకున్నది సాధించగలిగారా? కాంగ్రెస్ పార్టీని మెరుగైన స్థితికి తీసుకెళ్లగలిగారా? అంటే మొదటి దానికి సంతృప్తికరమైన సమాధానం వస్తోంది.రెండో దాని విషయంలో మాత్రం లేదనే జవాబు వస్తోంది. అన్నతో విభేదించి తెలంగాణలో పార్టీ పెట్టారు షర్మిల. అక్కడ అనుకున్న స్థాయిలో రాణించలేకపోయారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణలోని రాజకీయం చేయాలని భావించారు. కానీ కాంగ్రెస్ హై కమాండ్ అందుకు అనుమతించలేదు. ఏపీ పగ్గాలు అప్పగించింది. అయితే అక్కడ కాంగ్రెస్ అధ్యక్ష స్థానం దక్కించుకున్న షర్మిల.. పార్టీ బలోపేతం కంటే అన్న జగన్ పతనాన్ని ఎక్కువగా కోరుకున్నారు. అందులో మాత్రం సక్సెస్ అయ్యారు. ఆమె పోరాట ఫలితమే కడప జిల్లాలోవైసిపి పతనం.కానీ ఆమె పోరాటం కాంగ్రెస్ పార్టీకి విజయం చేకూర్చలేదు.కడప జిల్లా ప్రజలు మనసు మార్చేందుకు షర్మిల చేయని ప్రయత్నం అంటూ లేదు.కడప ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన ఆమె జిల్లా ప్రజలకు ఎన్నో రకాలుగా వినతులు ఇచ్చారు.ఆ మహానేత బిడ్డగా కొంగుచాచి అడుగుతున్నాను ఓటు వేయండి అని కోరారు.ఆమె తరుపున వివేక భార్య, కుమార్తె సైతం ప్రచారం చేశారు. వివేకానంద రెడ్డి ని హత్య చేసిన వారికి అండగా నిలబడతారో? బాధితులకు అండగా నిలబడతారో? తేల్చుకోవాలని జిల్లా ప్రజలను కోరారు.అయితే ప్రజలు మాత్రంఆమె మాటను విశ్వసించారు కానీ.ఆమెను ఆదరించలేదు. కూటమి వైపు మొగ్గు చూపారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ ప్రభావాన్ని చూపారు. 10 సీట్లకు గాను ఏడు చోట్ల కూటమి అభ్యర్థులను గెలిపించారు. కానీ పార్లమెంట్ స్థానానికి వచ్చేసరికి త్రిముఖ పోటీలో అవినాష్ రెడ్డి ని గెలిపించారు. వైసిపి అసెంబ్లీ అభ్యర్థులు గెలవడం ద్వారా షర్మిల లక్ష్యం నెరవేరినా.. ఎంపీగా అవినాష్ రెడ్డి గెలుపు మాత్రం షర్మిలకు రుచించని విషయం.అయితే ఒక జాతీయ పార్టీగా కాంగ్రెస్ లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ. కేవలం జగన్ ను దెబ్బతీయాలని షర్మిల చేయని ప్రయత్నం అంటూ లేదు. ఆ విషయంలో మాత్రం ఆమె సక్సెస్ అయ్యారు. కానీ కాంగ్రెస్ పార్టీని లైమ్ లైట్లో తీసుకురావడంలో మాత్రం ఫైలయ్యారు. నిన్నటి వరకు ఆమె కాంగ్రెస్ పార్టీకి ఆశాదీపం అవుతారని భావించిన వారు నీరుగారిపోయారు. పార్టీలో సైతం ఒక రకమైన అసంతృప్తి కనిపిస్తోంది. ఎన్నికల్లో టికెట్లు అమ్ముకున్నారన్న ఆరోపణ ఇప్పుడు బయటకు వచ్చింది. విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయాలనుకున్న సుంకర పద్మశ్రీ తాజాగా మీడియా ముందుకు వచ్చారు. షర్మిలపై ఆరోపణలు చేశారు. ఆమెతో కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి లాభం లేదని.. టిక్కెట్లు సైతం అమ్ముకున్నారని ఆరోపించారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో సైతం షర్మిలపై తిరుగుబాటు ప్రారంభం అయినట్టు కనిపిస్తోంది.

# వైసీపీ నేత కొత్త పల్లవి

విజయవాడ, జూన్ 8 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో అధికార వైసీపీ ఘోరంగా ఓడిపోయింది. అయినా ఆ పార్టీ నేతల్లో ఎలాంటి మార్పురాలేదు. పార్టీ ఓటమికి కుంటిసాకులు వెతికే పనిలో పడ్డారు నేతలు. ప్రజా తీర్పును అంగీకరించలేకపోతున్నారు. ఓటమిని వేరేవాళ్ల పైపు నెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారు.తమ పార్టీ ఎందుకు ఓడిపోయిందో కొందరు నేతలు మీడియా ముందుకొచ్చి ఓపెన్‌గా చెప్పేశారు. ఎమ్మెల్యే లు అయిన మాకే, ముఖ్యమంత్రిని కలిసి అవకాశం రాలేదని మనసులోని మాట బయటపెట్టారు. రోజుల తరబడి విజయవాడలో మకాం వేయాల్సి వచ్చిందని ఆవేదనను వ్యక్తంచేశారు. జగన్ చుట్టూ కోటరీయే దీనికి కారణమని గొంతెత్తారు. ఓడిపోయిన నేతల్లో ఒకవంతు మంది నేతలు గడిచిన ఐదేళ్లలో ఏం జరిగిందో చెప్పారు.రెండు వంతుల మంది మాత్రం ఈవీఎంలు ట్యాంపరింగ్ అయ్యిందనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు ఈ జాబితాలోకి ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి కూడా చేరిపోయారు. పక్కాగా గెలుస్తామని భావించిన 80 నియోజకవర్గాల్లో వెనుకబడ్డామని అంటున్నారు. కేతిరెడ్డి కామెంట్స్‌పై అప్పుడే సోషల్ మీడియాలో సెటైర్లు పడిపోతున్నాయి.ఈవీఎంలు ట్యాంపరింగ్ విషయం 2019 ఎన్నికల్లో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నల మీద ప్రశ్నలు రైజ్ చేస్తున్నారు. ఎన్నికల కోడ్ ఎత్తకముందే టీడీపీ అరాచకాలకు పాల్పడుతుందని చెప్పడం కూడా వైసీపీ నేతలకే చెల్లిందని అంటున్నారు తెలుగు తమ్ముళ్లు. గురువారం సాయంత్రం ఆరుగంటలకు కోడ్ ఎత్తేసింది ఎన్నికల సంఘం. అంతకుముందే ఏపీలో టీడీపీ అరాచకం మొదలైందని వైసీపీ నేతలు చెప్పడం ఇంతకన్నా దుర్మార్గం ఉంటుందా అని అంటున్నారు.ఎన్నికల కోడ్ నేపథ్యంలో మంగళవారం నుంచి ఇప్పటివరకు అధినేత చంద్రబాబు అధికారులను కలవ లేదని, శుభాకాంక్షలు చెప్పడానికి కొంతమంది మాత్రమే వచ్చారని అంటున్నారు. ఈ చిన్న లాజిక్‌ను వైసీపీ ఎలా మిస్సయ్యిందని అంటున్నారు. మరో వైపు వైసీపీ ఈవీఎంల ట్యాంపరింగ్ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు బీజేపీ ఎమ్మెల్యే సత్యకుమార్. ఈవీఎంలం ట్యాంపరింగ్‌కు అవకాశమే లేదని స్పష్టం చేశారు. ఇక.. ఈవీఎంలను అనుమానిస్తే.. ప్రజలను అవమానించినట్లే అన్నారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసినట్లు ఆరోపిస్తున్న వైసీపీ నేతల తీరుపై బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సెటైర్లు వేశారు. వైసీపీ నేతలది.. గెలిస్తే ఓ మాట.. ఓడితే ఒక మాట అన్నట్లుగా ఉందన్నారు. గతంలో వైసీపీ 151 సీట్లు గెలిచినప్పుడు లేని అనుమానాలు ఇప్పుడెందుకు వస్తున్నాయని ప్రశ్నించారు ఆదినారాయణరెడ్డి. మొత్తంగా.. ఈవీఎలం ట్యాంపరింగ్‌ల వ్యవహారం ఏపీ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారుతోంది. వైసీపీ నేతలను ఆరోపణలను బీజేపీ ఎమ్మెల్యేలు ఖండిస్తున్నప్పటికీ ఈవీఎంల ట్యాంపరింగ్‌పై అనుమానాలు రేకెత్తుతూనే ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఏదేమైనా రాబోయే రోజుల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ వ్యవహారం ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో చూడాలి.గతంలో కూడా ప్రతీదాన్ని భూతద్దంలో చూపించారని, ఓడిపోయినా బుద్ధి మారలేదంటూ వైసీపీలోని కొందరు నేతలు బహిరంగంగా చెప్పడం కొసమెరుపు.

# నెల్లూరులో కలిసొచ్చిన నారాయణ మంత్రం

నెల్లూరు, జూన్ 7 నెల్లూరు జిల్లా ఒకప్పుడు కాంగ్రెస్.. ఆ తర్వాత వైసీపీకి కంచుకోట. అలాంటి కంచుకోట గోడలు బద్దలయ్యాయి. ఆ కోటపై ఇప్పుడు టీడీపీ జెండా ఎగిరింది. నెల్లూరు జిల్లాలోని నెల్లూరు సిటి నియోజకవర్గం టీడీపీకి కలిసిరానిదిగా మిగిలింది. టీడీపీ ఆవిర్భావం తర్వాత రెండంటే రెండే సార్లు అక్కడ ఆపార్టీ గెలవగలిగింది. 1983, 1994 లో అక్కడ టీడీపీ గెలిచింది. అంతకుముందు, ఆ తర్వాత కాంగ్రెస్ మాత్రమే గెలుచుకుంటూ వస్తోంది. వైసీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీ ఖాతాలోకి నెల్లూరు సిటి వెళ్ళింది. 1994 తర్వాత ఒక్కసారి కూడా టీడీపీ గెలవలేక పోయింది. ఆరు పర్యాయాలు.. అంటే ముప్పై ఏళ్లుగా ఆ నియోజకవర్గంలో ఎంత పోరాడిన గెలుపు మాత్రం దక్కలేదు.అలాంటి చోట ఈ ఎన్నికల్లో టిడిపి జెండా ఎగిరింది. అదికూడా వైసిపి సామాజిక సమీకరణ అస్త్రాన్ని ప్రయోగించినా అనూహ్య విజయం సాధించింది టీడీపీ. 70,542 ఓట్ల బంపర్ మెజారిటీతో మాజీమంత్రి పొంగూరు నారాయణ గెలిచారు. మైనారిటీ ఓట్లు అధికంగా ఉన్న ఇక్కడ వైసిపి డిప్యూటీ మేయర్ ఖలీల్?ను రంగంలోకి దించినా మైనారిటీ ఓటర్లు సైతం మెజారిటీగా నారాయణ వైపు నిలిచారు. గెలుపే దక్కని నియోజకవర్గంలో నారాయణ ఇంత మెజారిటీతో గెలవడం ఇక్కడ డబుల్ రికార్డ్. 2014లో ఎమ్మెల్సీగా, మంత్రిగా పనిచేసిన నారాయణ నెల్లూరు సిటీలో భారీగా నిధులు తెచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. 2019 ఎన్నికల్లో గెలుపు దాకా వెళ్లి తక్కువ ఓట్లతో మాజీమంత్రి అనిల్ కుమార్ యాదవ్ చేతిలో ఓటమి పాలయ్యారు. మళ్లీ ఇక్కడి నుంచే పోటీ చేశారు

# అప్పలనాయుడు ఫైట్ టిక్కెట్ తీయాలా...

## విజయనగరం ఎంపీని అడిగిన బాబు

విజయవాడ, జూన్ 8 ఏపీ ఎన్నికల్లో చిత్రవిచిత్రాలు వెలుగు చూశాయి. సామాన్యులు సైతం ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారు. రంపచోడవరం నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా అంగన్వాడీ టీచర్ ఎన్నికయ్యారు. కొద్ది సంవత్సరాలుగా రంపచోడవరం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరలేదు. గత రెండు ఎన్నికల్లో అక్కడ వైసీపీ అభ్యర్థులే ఎన్నికవుతూ వచ్చారు. అయితే ఈసారి అక్కడ పార్టీ జెండా ఎగురవేయాలని చంద్రబాబు భావించారు. అంగన్వాడీ టీచర్ గా ఉన్న శిరీషా దేవిని రంగంలోకి దించారు. ఆమెకు అన్ని విధాలుగా ఆర్థిక వనరులు సమకూర్చారు. దీంతో ఆమె అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. ఒక సామాన్య అంగన్వాడీ టీచర్ ఎమ్మెల్యేగా మారారు. అటు విజయనగరం ఎంపీగా గెలిచిన కలిశెట్టి అప్పలనాయుడు పరిస్థితి కూడా అదే. ఆయన ఓ సామాన్య నాయకుడు. ఆర్థికంగా కూడా అంతంత మాత్రమే. కానీ ఆయన సీనియారిటీని, సిన్సియారిటీని మెచ్చి టిక్కెట్ ఇచ్చారు.అనూహ్యంగా అక్కడ నుంచి ఎంపీగా గెలిచారు అప్పలనాయుడు.సాధారణంగా చంద్రబాబు అంటే కార్పొరేట్ స్థాయి అని అందరూ అనుకుంటారు. కానీ ఆయన పార్టీ శ్రేణుల ఆర్థిక స్థితిగతులను కూడా తెలుసుకుంటారని నిన్ననే తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా గెలిచిన ఎంపీలతో చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. వారికి దిశ నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన సమస్యలు, కేంద్ర ప్రభుత్వ పరంగా రావాల్సిన ప్రాజెక్టులు, రాయితీల విషయంలో గట్టిగా పోరాటం చేయాలని కూడా పార్టీ ఎంపీలకు చంద్రబాబు సూచించారు. తనను తరచూ కలుసుకోవాలని.. ఎటువంటి ఆంక్షలు ఉండవని కూడా తేల్చి చెప్పారు. అయితే సమావేశం చివరిలో విజయనగరం ఎంపీ అప్పలనాయుడు ను తన వద్దకు పిలిపించుకున్నారు చంద్రబాబు.అప్పలనాయుడిది ఓ సాధారణ కుటుంబం. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. అందున బొత్స కుటుంబ అడ్డాలో పోటీ చేశారు. రెండు లక్షల 50 వేలకు పైగా మెజారిటీ సాధించారు. చంద్రబాబు ఇచ్చిన పిలుపునకు కేడర్ గట్టిగానే ఫైట్ చేసింది. అటు అప్పలనాయుడు కమిట్మెంట్ సైతం చంద్రబాబుకు నచ్చింది. అందుకే ప్రత్యేకంగా అప్పలనాయుడును పిలిపించుకున్న చంద్రబాబు అభినందించారు.

# వాడపల్లికి పోటెత్తిన భక్తులు



కొత్తపేట,నైరుతి రుతుపవనాలు తాకిడితో వర్షాలు కురుస్తున్నప్పటికీ వర్షాన్ని సహితం లెక్కచేయకుండా తెల్లవారు జాము నుండే భక్తులు శనివారం కోనసీమ తిరుపతి వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి పోటెత్తారు. ఏడు వరాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అంటూ విలసిల్లిన వాడపల్లి వెంకన్న భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం గా పిలుస్తారు.ఏడు వారలు పాటు వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుంటే తమ కోర్కెలు ఖచ్చితముగా నెరవేరుతాయి అని భక్తులు నమ్మకం, ఆ నమ్మకంతో దేశం నలుమూలలు నుండి అధిక సంఖ్యలో భక్తులు రావడం విశేషం, ఇటీవల ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలు కూడా దర్శనానికి వస్తున్నారు. ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ,వేగుళ్ల జోగేశ్వరరావు, ఉంగుటూరు ఎమ్మెల్యే పనమట్ల ధర్మరాజు తోపాటు పలువురు రాజకీయ నాయకులు దర్శనానికి వచ్చారు.

ప్రతి రోజు స్వామి వారికీ మేలుకొలుపు, సుప్రభాత సేవ, తొలి హారతి తో సేవలు మొదలయ్యి, భక్తులు దర్శనం తో పాటు వారికి అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేసి,భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు .

## పాణ్యం ఎస్సీ కాలనీలో 65 రోజుల నుంచి త్రాగు నీరు లేదు

**---వారంలో నీటి సమస్య తీరుస్తాం రమణ మూర్తి టిడిపి కార్యదర్శి**



---- విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 08 - పాణ్యం ఎస్సీ కాలనీలో 65 రోజులనుండి ప్రజలు త్రాగు నీరు సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ఎస్ ఎఫ్ ఐ నాయకులు బత్తిన ప్రతాప్. వనము వెంకటాద్రి. బాలసుంకన్న ఆవేదన వ్యక్తం చేశారు . వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ అధికారులు, గ్రామ సర్పంచ్ గారికి సమస్య తెలియచేసిన ఫలితం లేకుండా పోయిందన్నారు. అధికారులు పట్టించుకోకపోవడం తో శనివారం గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేసామన్నారు . ఈ విషయాన్ని తెలుసుకున్న టీడీపీ జిల్లా కార్యదర్శి రమణమూర్తి వెంటనే స్పందించి మాకు అధికారం ఇప్పుడు వచ్చింది. ఎమ్మెల్యే తో మాట్లాడి ఒక వారం లోపు మీ సమస్యలను కచ్చితంగా తీరుస్తామని హామి ఇవ్వడం తో సమ్మె విరమించామని ఎస్ ఎఫ్ ఐ నాయకులు తెలిపారు.

## మహానందిశ్వరునికి ఎయిర్ కండీషన్ వితరణ



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 08-కడప వాస్తవ్యులు సునీల్,వెంకటలక్ష్మమ్మ,జయంత్,దినేష్ కుమార్. కుటుంబ సభ్యులు షుమారు 50.000 రూ. విలువ గల ఎయిర్ కండిషనర్ శ్రీ మహానందిశ్వర స్వామి వారి దేవస్థానమునకు విరాళంగా సమర్పించారు. వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి ఆలయ మర్యాదలతో స్వామి వారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులు దేవస్థానం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఛత్తీస్‌ఘడ్‌లో మరోమారు ఎదురుకాల్పులు

**ఏడుగురు మావోయిస్టుల హతం**

రాయపూర్,జూన్8: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మరోమారు తుపాకుల మోతతో దద్దరిల్లింది. నారాయణ్ పూర్, దంతేవాడ జిల్లాల సరిహద్దులోని గోబెల్ అటవీ ప్రాంతంలో శనివారం భారీ ఎన్ కౌంటర్ జరిగింది. పక్కా సమాచారంతో కూబింగ్ నిర్వహిస్తున్న భద్రతా దళాలకు... మావోయిస్టులు ఎదరుపడ్డారు. దీంతో రెండు వర్గాలు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. ఈ ఎన్ కౌంటర్ లో.. ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతిచెందినవారు నారాయణ్ పూర్, దంతేవాడ, బస్తర్, కొండగావ్ జిల్లా వాసులుగా పోలీసులు అధికారులు గుర్తించారు.

## భార్యాభర్తల గొడవలు , కుటుంబ కలహాల పరిష్కారానికి దిశ ఫ్యామిలీ కౌన్సిలింగ్ .మహిళల ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత

**... దిశా డిఎస్పీ జె. బాబు ప్రసాద్. కర్నూల్ రేంజ్ డీఐజీ సిహెచ్ .విజయ రావు ఐపీఎస్ , జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ల ఆదేశాల మేరకు ఈరోజు కర్నూలు దిశ పోలీసుస్టేషన్ లో కర్నూల్ దిశా డిఎస్పీ జె. బాబు ప్రసాద్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు.**



కర్నూలు జూన్ 08: పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించిన 6 కుటుంబాలకు కౌన్సెలింగ్ నిర్వహించి డిస్పి గారు మాట్లాడారు. ఇందులో 2 కుటుంబాలు రాజీ అయ్యాయి.వారికి కుటుంబ గొడవలు, భార్యాభర్తల సమస్యలు మరియు ఇతర మహిళా సంబంధిత ఫిర్యాదుల పరిష్కారంలో సమర్థవంతంగా కౌన్సిలింగ్ నిర్వహించుటకు పలు కీలక సూచనలు చేశారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ చర్యలు తీసుకుంటున్నామని , కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమవుతున్న నేపథ్యంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ చాలా ముఖ్యమైనది.భార్యాభర్తలు చిన్న చిన్న కలహాలు, మనస్పర్థలతో, అనుమానాలు, అపార్థాలు, అసూయా ద్వేషాలతో వారి కుటుంబాలు కుప్పకూలకుండ నిలబెట్టడంలో ఈ దిశా కౌన్సెలింగ్ సెంటర్ ఎంతోగానూ దోహదపడుతుందని కర్నూలు దిశా డిఎస్పీ జె. బాబు ప్రసాద్ పేర్కొన్నారు. కుటుంబ తగాదాలు, భార్య భర్తల గొడవలకు చక్కటి పరిష్కార మార్గం చూపుటకు కౌన్సిలింగ్ సమర్థవంతం నిర్వహించుటకు అనుభవజ్ఞులైన ఫ్యామిలీ కౌన్సిలింగ్ సభ్యులతో ప్యానెల్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే మహిళా ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, అంకితభావంతో, పనిచేయాలని, సమస్యలు త్వరితగతిన పరిష్కరించే విధంగా చూడాలని సిబ్బందికి కర్నూలు దిశా డిఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు దిశా సిఐ లు, ఎస్సై లు, కౌన్సిలింగ్ నిపుణుడు రిటైర్డ్ లెక్చరర్ సత్యనారాయణ, అడ్వకేట్స్ కావేరి, సైకాలజిస్ట్ పెరుమాళ్ళ లెనిన్ బాబు, ఒన్ స్టాప్ సెంటర్ సిబ్బంది మేరీ , సునీత లు, ఔఊబ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## రామోజీరావు మరణం బాధాకరం

**రాజీలేని జీవితం గడిపిన రామోజీ**
**దేశంలో అంతటి పలుకుబడి ఉన్న వ్యక్తిని చూడలేదు**
**మాజీ ఎంపి ఉండవల్ల అరుణ్ కుమార్ వ్యాఖ్య**



రాజమండ్రి,జూన్8: భారతదేశంలో రామోజీరావు అంత పలుకుబడి ఉన్న వ్యక్తిని తాను మరెక్కడా చూడలేదని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. రామోజీరావు మరణం వార్త తెలిసిన తర్వాత రాజమండ్రిలో మీడియాతో మాట్లాడారు. రామోజీరావు మరణం బాధాకరం అని, కుటుంబానికి ప్రగాడ సానుభూతి అని తెలిపారు. ఆయన ఎవరితోని రాజీ పడకుండా పూర్తి జీవితం గడిపారన్నారు. ఆయనను కలుద్దామని చాలాసార్లు ప్రయత్నం చేశాను కానీ సాధ్యం కాలేదన్నారు. రామోజీరావు ఏ రంగంలోకి ప్రవేశించినా ఒక సెలబ్రిటీ స్థాయికి ఎదిగారని గుర్తు చేసుకున్నారు. రామోజీరావుపై ఆర్థిక పరమైన ఆరోపణలు చేసి ఆయనపై కోర్టుల్లో పిటిషన్లు వేసింది ఉండవల్లి అరుణ్ కుమార్. ఈ సంస్థ చట్టపరమైన నిబంధనలు పాటించడం లేదంటూ ఉండవల్లి అరుణ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ హోదాలో పలు కేసులు వేశారు. డిపాజిట్ల సేకరణ ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా సాగిందని ఉండవల్లి ఆరోపణ కాగా, అందరికీ డిపాజిట్లు తిరిగి చెల్లించామని మార్గదర్శి స్పష్టం చేసింది. మార్గదర్శి చిట్ ఫండ్స్ ద్వారా డిపాజిట్లు సేకరించకూడదని.. అయినా సేకరించారని ఆయన కేసులు వేశారు. ఆ కేసుల కారణంగా ఈటీవీ మీడియా నెట్ వర్క్ లో ఇతర రాష్ట్రాల్లో విస్తరించిన వ్యాపార సామ్రాజ్యాన్ని అమ్మేసి డిపాజిట్లు చెల్లించేశారు. తాను ఎంపీగా దిగిపోయినప్పటికీ, కాంగ్రెస్ అధికారంలో లేనప్పటికీ, ఉండవల్లి అరుణ్ కుమార్ మాత్రం నిరంతరం ఆ కేసును కొనసాగిస్తూ వచ్చారు. వైయస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా ఏపీ సీఐడీ కూడా మార్గదర్శిపై కేసు పెట్టి, రామోజీ రావును విచారించింది. మీడియా ద్వారా తమను ఇబ్బంది పెడుతున్నారన్న ఉద్దేశంతోనే ఉండవల్లి ద్వారా వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్ ఇబ్బంది పెట్టారన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఇప్పుడు ఉండవల్లి అరుణ్ కుమార్ కూడా రామోజీరావును ప్రశంసిస్తున్నారు. ఆయన దేనికీ లొంగలేదని.. టైగర్‌గానే చనిపోయారని అంటున్నారు.

## మూత్ర విసర్జనకు ఐదురూపాయలా...?

**---సిపిఐ నాయకులు ఆరోపణలు**




-విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 08-నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ లో నిర్మించిన టాయిలెట్ల యందు పాచుకు ఐదు రూపాయలు కాంట్రాక్టర్లు వసులు చేస్తున్నారని సీపీఐ నాయకులు ఆరోపణలు చేస్తున్నారు . సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో శనివారం సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ సహాయ కార్యదర్శి జి సోమన్న ఏఐటియుసి పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ బస్టాండ్ లో ఆర్టీసీ యాజమాన్యం మరుగుదొడ్లు నిర్మించి టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పజెప్పడం జరుగుతుంది. కానీ కాంట్రాక్టర్లు ఆర్టీసీ వారు టెండర్ లో నిర్ణయించిన రేటు ప్రకారం కాకుండా ఇస్తానుసారంగా ప్రజలను ప్యాసింజర్లను దోచుకోవడం జరుగుతుందన్నారు. పాచుకుపోతే ఐదు రూపాయలు లెట్రిన్ కు పోతే పది రూపాయలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారని విమర్శించారు. అదేమిటి బయట బోర్డు పైన లిటిల్ కు అయిదు రూపాయలు పాస్ కు పోతే ఏమీ లేదు అని రాసినారు కదా అని ప్యాసింజర్లు అడిగితే సమాధానం చెప్పారు. డిఎం గారి దృష్టికి తీసుకు పోతామని అంటే మీ దిక్కున వారికి చెప్పుకోండి అని డిఎం గారే మాకు పరిమిషన్ ఇచ్చారని ప్రజలను బెదిరిస్తున్నారు.కనుక వెంటనే డిఎం వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో ప్యాసింజర్లను కలుపుకొని టాయిలెట్లకు తాళాలు వేసి నిరసన తెలుపుతామని హెచ్చరించారు .

## ..రామోజీరావు మృతి పై కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజుగ్భ్రాంతి...

**రామోజీరావు తెలుగు రాష్ట్రాలకు, దేశానికి ఎనలేని సేవలు అందించారు...**
**సామాన్య కుటుంబంలో జన్మించి ఎన్నో విజయాలు సాధించిన రామోజీరావు జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలి..**
**.ఎం.పి బస్తిపాటి నాగరాజు**



కర్నూలుజూన్ 08:ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు మృతి పై కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజుగ్ర్భ్రాంతి వ్యక్తం చేశారు...సామాన్య కుటుంబంలో జన్మించి ఎన్నో విజయాలు సాధించిన రామోజీరావు జీవితం అందరికి ఆదర్శమని , అక్షర యోధుడుగా పేరున్న రామోజీరావు తెలుగు రాష్ట్రాలకు, దేశానికి అందించిన సేవలు ఎనలేనివని నాగరాజు తెలిపారు.. ఈనాడు గ్రూపు సంస్థల స్థాపనతో వేల మందికి ఉపాధి కల్పించారన్న ఆయన.. మీడియా రంగంలో రామోజీది ప్రత్యేకమైన శకమన్నారు.. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిసస్తూ వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు..

## రామోజీ రావు చిత్రపటానికి ఘన నివాళి అర్పించిన రబ్బానీ బ్రదర్స్



నందికొట్కూరు ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు అస్తమయం తీవ్రగ్ర్భ్రాంతిని కలిగించింది. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ పరమా దేవుని కోరుకుంటూ నందికొట్కూరు పట్టణంలోని స్థానిక రబ్బాని కాంప్లెక్స్ లో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రబ్బానీ బ్రదర్స్ మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్య విజయాలు సాధించిన రామోజీరావు మరణం తీవ్ర ఆవేదనకు గురి చేసింది.అక్షర యోధుడుగా రామోజీ తెలుగు రాష్ట్రాలకు దేశానికి ఎన్నో సేవలుఅందించారు. తెలుగు వారి జీవితాల్లో అత్యంత ప్రభావవంతమైన ముద్రవేసిన రామోజీ తెలుగు ప్రజల ఆస్తి. ఆయన మరణం తెలుగు ప్రజలకే కాదు.దేశానికి కూడా తీరని లోటు.సమాజ హితం కోసం అనుక్షణం పనిచేసిన ఆయన కీర్తి అజరామరం ఈనాడు గ్రూపు సంస్థల స్థాపనతో వేల మందికి ఉపాధి కల్పించారు.మీడియా రంగంలో రామోజీ ప్రత్యేకమైన శకం ఎన్నో సవాళ్లను,సమస్యలను అధిగమించి.ఎక్కడా తలవంచకుండా రామోజీరావు విలువలతో సంస్థలను నడిపిన విధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం. దశాబ్దాల తన ప్రయాణంలో అనుక్షణం ప్రజల మంచి కోసం, సమాజ హితం కోసం రామోజీరావు పనిచేశారు మీడియా రంగంలో ఆయనొక శిఖరం ఆయన ఇక లేరు అనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నాము.

# రామోజీ ఓ ధృవతార



హైదరాబాద్,జూన్8: మీడియా దిగ్గజం రామోజీరావు మృతిపై పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేసారు. రామోజీ ఫలిం సిటీకి చేరుకుని భౌతిక కాయం వద్ద నివాళి అర్పించారు. అఖండమైన తెలుగు జ్యోతి ఆరిపోయిందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఆయన రామోజీ ఫిలిం సిటీకి వెళ్లి రామోజీ పార్థీవ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. రామోజీ రావు వ్యక్తి కాదని, శక్తివంతమైన వ్యవస్థ అని పేర్కొన్నారు. జీవితంలో స్వయంకృషితో కష్టపడి అనేక రంగాల్లో విజయం సాధించి మనకు దూరమయ్యారని తెలిపారు. ఓ ధృవతారగా వెలుగుతూ ఉంటారని... ఆయన చేతలు, రాతలు, చేపట్టిన కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని భావిస్తున్నానని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. పత్రిక పెట్టిన నాటి నుంచి వారితో

**రామోజీ వ్యక్తి కాదు..అనంతమైన శక్తి**
**స్వయంకృషితో పైకి వచ్చిన మహానుభావుడు**
**నివాళి అర్పించిన వెంకయ్య, జస్టిస్ ఎన్‌వి రమణ**
**రామోజీకి నివాళి అర్పించి దత్తాత్రేయ తదితరులు**



ఎంతో సన్నిహితంగా ఉండేవాడినని.. ఆయనతో వివిధ సందర్భాల్లో చర్చించటం వల్ల పరిపక్వత చెందానని తాను భావిస్తానని వెంకయ్య నాయుడు తెలిపారు. వారు పోరాట యోధులని.. జీవితంలో మరింత కాలం పోరాడతారని భావించానన్నారు. విజయం సాధించినప్పటికీ, ఇంత త్వరగా వారు పోరాటాన్ని ముగిస్తారని అనుకోలేదన్నారు. తన కుటుంబ సభ్యులను అభిమానించే వారని పేర్కొన్నారు. మా కుటుంబం తరుఫున రామోజీరావు స్మృతికి నివాళులు అర్పిస్తున్నానన్నారు. వారి కుటుంబ సభ్యులందరికీ తన తరుఫున, తన కుటుంబ సభ్యుల తరుఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని రామోజీ తెలిపారు. ఈనాడు, ఉషాకిరణ్ సంస్థల అధిపతి రామోజీరావు అస్తమయం పట్ల భారత ప్రధాన మాజీ న్యాయమూర్తి , జస్టిస్ ఎన్‌వీ రమణ దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. రామోజీరావు ప్రజాస్వామ్య పరి రక్షణ కోసం, ప్రజల కోసం అలుపెరుగని యోధుడిలా పనిచేసిన పోరాట యోధుడని కొనియాడారు.నేడు ప్రజాస్వామ్య విజయాన్ని చూసి, ఆనందించి, స్వర్గస్తులయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామోజీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**